గురువారం తన పుట్టినరోజు సందర్భంగా బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌ను మర్యాదపూర్వకంగా కలిసి ఆశీర్వాదం తీసుకుంటున్న జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి

భూములు.. బిల్లులు.. బ్లాక్ మెయిల్

మొదటిపేజీ తరువాయి...

చేరారని ఆ జిల్లాలో జోరుగా ప్రచారం జరుగుతున్నది. 'పార్టీలో చేరుతావా? లేదంటే ఫలానా కేసులో లోపల తోయాలా?' అని ఓ ఎమ్మెల్సీకి బెదిరింపు వర్తమానం చేరగానే ఆయన పార్టీ మారారని ప్రచారం సాగుతున్నది. బీఆర్ఎస్ నుంచి గెలిచిన ప్రజాప్రతినిధులపై కాంగ్రెస్ పార్టీ 'బీ క్యూబ్'(బిల్లు, భూమి, బ్లాక్‌మెయిల్) ఫార్ములాను ప్రయోగిస్తున్నదని జరుగుతున్న పరిణామాలు స్పష్టం చేస్తున్నాయి.

బీఆర్ఎస్‌ను బలహీనపరిచే వ్యూహం

అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ కూటమికి 64 సీట్లు రాగా, బీఆర్ఎస్ పార్టీ నుంచి 39 మంది ఎమ్మెల్యేలు గెలుపొందారు. శాసనసభలో బీఆర్ఎస్ బలమైన ప్రతిపక్షంగా ఉన్నది. శాసనమండలిలోనూ బీఆర్ఎస్‌కు ఏకపక్ష మెజార్టీ ఉంది. అధికార పార్టీకి ఇది తలనొప్పిగా మారింది. దీంతో బీఆర్ఎస్‌ను అటునుంచి నరుక్కొచ్చి బలహీనపరిచే వ్యూహాన్ని రచించినట్టు తెలిసింది.

పార్లమెంట్ ఎన్నికలకు ముందు నుంచే

నిర్దేశించుకున్న చేరికల లక్ష్యాన్ని చేరుకునేందుకు కాంగెస్ పార్టీ 'బీబీబీ' వ్యూహాన్ని రచించిందని, పార్లమెంటు ఎన్నికల సమయంలో దానిని ప్రయోగించిందని రాజకీయ వర్గాలు చెప్తున్నాయి. అందులో భాగంగానే 'భూ' ఆరోపణలను ఎదుర్కొంటున్న సిట్టింగ్ ఎంపీని, ఒక ఎమ్మెల్యేను చేర్చుకొని వారికి టికెట్లు ఇచ్చి ఎన్నికల్లో పోటీ చేయించిందని రాజకీయ వర్గాల్లో అప్పట్లో జోరుగా ప్రచారం జరిగింది. అలా పోటీలోకి దిగిన ఇద్దరూ ఆ ఎన్నికల్లో ఓటమి పాలయ్యారు. వ్యాపారరంగంలో ఆరితేరిన ఉత్తర తెలంగాణకు చెందిన ఒక ఎమ్మెల్యేకు అదే తరహా బెదిరింపులు వెళ్లాయని ప్రచారం జరుగుతున్నది. 'బీఆర్ఎస్‌లో ఉంటే లాభం లేదు. ఇటొచ్చెయ్. పార్టీలో చేరగానే ఎంపీ టికెట్ ఇచ్చి గెలిపించుకుంటాం' అని సదరు ఎమ్మెల్యేకు ఆఫర్ ఇస్తే, ఆ ఎమ్మెల్యే ససేమిరా అని మొండికేశారని అప్పట్లో విస్తృతంగా ప్రచారం సాగింది.

బీబీబీ కోసం ఓ వ్యవస్థ

బీఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలను చేర్చుకొనేందుకు అనుసరిస్తున్న బీక్యూబ్ ఫార్ములాను పార్లమెంట్ ఎన్నికల తర్వాత విస్తృతంగా ప్రయోగిస్తున్నట్టు జరుగుతున్న పరిణామాలు స్పష్టం చేస్తున్నాయి. ఇందుకోసం ప్రభుత్వంలో ఒక వ్యవస్థే ఏర్పడినట్టు సమాచారం. అర్ధరాత్రి ఆరుగురు ఎమ్మెల్సీలను చేర్చుకోవడం, వాయిదా పద్ధతుల్లో ఎమ్మెల్యేలను చేర్చుకోవడం వంటి పరిణామాలు అందులో భాగమేనని చెప్తున్నారు. ఆ ప్రచారం నిజమేనని చేరికలు స్పష్టం చేస్తున్నాయని రాజకీయ పండితులు ఉదహరిస్తున్నారు. ఆ ఫార్ములాను అనుసరించే ఎమ్మెల్యేలకు గాలం వేస్తున్నారని, నేడో రేపు మరో ఇద్దరు ముగ్గురు చేరబోతున్నారని అంటున్నారు. ఒక సీనియర్ ఎమ్మెల్యే రోజువారీ 'లక్ష'ణమైన సంపాదనకు గండికొడతామనే బెదిరింపులు రావడం, సదరు నేత కొడుకు రాజకీయ భవిష్యత్తును లేకుండా చేస్తామని గట్టి హెచ్చరిక రావడంతో ఆ నేత కాంగ్రెస్‌పార్టీ కండువా కప్పుకొని జాగ్రత్త పడ్డారనే ప్రచారం జరుగుతున్నది. మొత్తంగా కాంగ్రెస్ పార్టీ బీబీబీ విధానాన్ని నమ్ముకొని ముందుకు సాగుతున్నదే తప్ప ప్రజామోద నిర్ణయాలు తీసుకొని పాలన సాగించాలని అనుకోవడం లేదని రాజకీయ విశ్లేషకులు విమర్శిస్తున్నారు.

భూమి చెర.. బాంచెన్ దొర!

మొదటిపేజీ తరువాయి...

వెళ్లి ఆ భూములు హెచ్ఎండీఏకు చెందినవేనని తీర్పు వచ్చే వరకు పోరాడింది. కబ్జాదారులు ఎవరైనా సరే ఉపేక్షించకుండా హెచ్ఎండీఏ అధికారులు అందులోని అక్రమ నిర్మాణాలన్నింటినీ నేలమట్టం చేసి సుమారు రూ.1,000 కోట్ల విలువైన భూముల్ని ప్రభుత్వపరం చేశారు. శంషాబాద్ మండలం సయ్యద్‌గూడ, చిన్న గోల్కొండ పంచాయతీ సర్వే నంబరు 24లో 200 ఎకరాలు, పెద్ద గోల్కొండ పరిధిలో సర్వేనంబర్ 114నుంచి 176వరకు 185 ఎకరాలు.. ఇలా మొత్తం 385 ఎకరాల అసైన్డ్ భూములు ఉన్నాయి. దీనిపై కన్నేసిన సదరు ప్రజాప్రతినిధి రైతులను బెదిరించి తోచినంత ముట్టజెప్పి నిబంధనలకు విరుద్ధంగా ప్రభుత్వ భూమిని రిజిస్ట్రేషన్ చేసుకుని, రెవెన్యూ రికార్డులను మార్చేందుకు ప్రయత్నించారు. కానీ, కేసీఆర్ ప్రభుత్వం ఆ అక్రమాలను అడ్డుకుంది. రిజిస్ట్రేషన్లను నిలిపివేసింది. మ్యుటేషన్లు కాకుండా కట్టడి చేసింది. శంషాబాద్ మండలం ఘాన్సిమియాగూడ పరిధిలోని సర్వే నంబర్ 4లో జాగిర్దారీ భూములున్నాయి. నిరుపేదలకు దక్కాలి, లేదంటే ప్రభుత్వ ఖాతాలో ఉండాలి. కానీ కొందరు పెద్దలు ఈ భూములపై కన్నేసి పంచుకున్నారు. ఇందులో సదరు ప్రజాప్రతినిధి ఐదెకరాల భూమిని మలుపుకొని ప్రహరీతో గెస్ట్‌హౌస్ నిర్మించుకున్నారు. గతంలో ఈ భూముల్ని పేదలకు పంచాలంటూ ప్రస్తుత సీఎంరేవంత్ టీడీపీలో ఉన్నప్పుడు ధర్నా కూడా చేశారు. సదరు ప్రజాప్రతినిధి ఆ భూములను పట్టా భూములుగా మార్చేందుకు పదేండ్లుగా ప్రయత్నం చేశారు. కేసీఆర్ ప్రభుత్వ హయాంలో ఎక్కే గడప దిగే గడప అన్నట్టుగా వెంపర్లాడారు. కానీ ఆయన పాచిక పారలేదు.

చిన్న అవకాశాన్నీ ఇవ్వని కేసీఆర్ సర్కార్

గొల్లపల్లి, బహదూర్‌గూడ పరిధిలోని అసైన్డ్

భూములతో పాటు ఎయిర్‌పోర్టు కాలనీలో హెచ్ఎండీఏకు చెందిన 13 ఎకరాలపైనా సదరు ప్రజాప్రతినిధి, ఆయన అల్లుడు కన్నేసి స్వాధీనం చేసుకునేందుకు నానా తంటాలుపడ్డారు. కానీ కేసీఆర్ ప్రభుత్వ హయాంలో ఎప్పటికప్పుడు అధికారులు ఆ ప్రయత్నాలను తిప్పికొట్టారు. సర్కారు రికార్డుల్లో ఎక్కడా ప్రభుత్వ భూములను పట్టాలుగా మార్చే చిన్న అవకాశాన్ని కూడా ఇవ్వలేదు. అందుకే ఆ ఘనత వహించిన ప్రజాప్రతినిధి ఇప్పుడు గోడ దూకేందుకు సిద్ధమయ్యారు. ఓట్లేసిన జనాన్ని నట్టేట ముంచుతూ వారి నమ్మకాన్ని వమ్ము చేస్తూ మరి కొన్ని గంటల్లోనే పార్టీ కండువా మార్చనున్నారు. కేసీఆర్ ప్రభుత్వం ఉన్నప్పుడు పదేండ్లుగా ఎక్కడా సందు దొరకక తికమకపడుతున్న ఈ ప్రజాప్రతినిధిని 'భూ'ఛీని అడ్డుపెట్టుకొని అధికార కాంగ్రెస్ వల విసిరింది. బీఆర్ఎస్ కావాలా? భూములు కావాలా? అని పాచిక విసిరింది. దీంతో ఫిరాయింపునకు ముహూర్తం ఖరారైంది.

చర్చనీయాంశంగా ఎమ్మెల్యే భూ దాహం

తాజాగా నగర శివారులో జంపింగ్‌కు సిద్ధమైన ఒక ఎమ్మెల్యే భూ దాహం రాష్ట్ర రాజకీయాల్లో చర్చనీయాంశంగా మారింది. అధికారం, అంతకుమించి ప్రభుత్వ, నిరుపేదల భూములను వందలాదిగా స్వాధీనం చేసుకోవాలనే చిరకాల స్వప్నంతో కండువాలు మార్చుతున్న వైనంపై పెద్ద ఎత్తున గుసగుసలు మొదలయ్యాయి. మరికొన్ని గంటల్లో ముచ్చటగా మూడో పార్టీ మార్చనున్న సదరు ఎమ్మెల్యే భూ లీలలను ఇప్పుడు నియోజకవర్గంలో కథలు కథలుగా చెప్పుకుంటున్నారు. నాలుగు దశాబ్దాల కిందట శంషాబాద్ మండలం సుల్తాన్‌పల్లి గ్రామ జాగీర్దార్ భూములపై వివాదం రాజుకుంది. 200 ఎకరాలకుపైగా ఉన్న ఆ భూముల్లో 75 నాగళ్లు (నాగలికి మూడెకరాలు) కింద రైతులు సాగు చేసుకునేవారు. ఆ భూములను జాగిర్దార్ల నుంచి తాము కొనుగోలు చేశామంటూ మాజీ ఎంపీ తులసీరాం భూముల స్వాధీనానికి తీవ్ర ప్రయత్నాలు చేశారు. అప్పట్లో ప్రభుత్వాలపై ఒత్తిడితెచ్చినా వివాదం కొలిక్కి రాకపోవడంతో న్యాయస్థానం పరిధిలోకి వెళ్లింది. ఈ క్రమంలో వైఎస్ రాజశేఖర్‌రెడ్డి పాదయాత్ర సందర్భంగా రైతులు తమ భూములను తమకు ఇప్పించాలని వినతిపత్రం ఇవ్వడంతో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత కొంత మేర ఆ దిశగా అడుగులు పడి, ఆపై వివాదం మళ్లీ మొదటికొచ్చింది. అనంతరం 2009 తర్వాత వివాదం మరో మలుపు తిరిగింది. ఇందులోకి కొత్తగా 'ప్రజాప్రతినిధి' రంగ ప్రవేశం చేశారు. ప్రైవేటు కంపెనీకి ఆ భూములను కట్టబెట్టేందుకు ప్రయత్నాలు మొదలుపెట్టారు. 2014 తర్వాత ఈ పని కోసమే అప్పట్లో అధికారంలో ఉన్న బీఆర్ఎస్‌లోకి వచ్చినా ఆయన పాచిక పారలేదు. కేసీఆర్ ప్రభుత్వ హయాంలో రికార్డులను ఏమార్చేందుకు ఆయన అనేక రకాల ఒత్తిడి తెచ్చినా సఫలం కాలేదు.

అక్రమాలకు గ్రీన్‌సిగ్నల్ వచ్చిందా?

గతంలో భూ లావాదేవీల కోసమే సదరు ప్రజాప్రతినిధి పార్టీ మారినట్టుగా అర్థమవుతున్నదని పలువురు రాజకీయ పరిశీలకులు చెప్తున్నారు. గత పదేండ్లలో ఆ పాచికలు పారకపోవడంతో తాజాగా అధికార కాంగ్రెస్ వైపు తొంగిచూశారు. అక్కడా ఇదే అదునుగా భూ గాలం విసరడంతో ఈ అక్రమాలకు మార్గం సుగమం చేస్తామనే హామీ లభించిందనే ప్రచారం జరుగుతున్నది. గత కొన్నిరోజులుగా జరిగిన చర్చల్లోనూ ఈ భూ లావాదేవీల క్లియరెన్స్ అంశమే ప్రధాన ఎజెండాగా ఉన్నదనే వార్తలు వినిపించాయి. అటువైపు నుంచి గ్రీన్‌సిగ్నల్ రావడంతో అధికార పార్టీలోకి దూకేందుకు ముహూర్తం ఖరారు చేసుకున్నారని నియోజకవర్గంలో పెద్ద ఎత్తున ప్రచారం జరుగుతున్నది.

అల్లుడు.. సర్కారు భూముల గిల్లుడు

సదరు ప్రజాప్రతినిధి పదేండ్లపాటు నియోజకవర్గంలోని ప్రభుత్వ, అసైన్డ్ భూములపై కన్నేయడం, ఆయన అల్లుడు రంగంలోకి దిగి కార్యాలు చక్కబెట్టడం పరిపాటిగా మారింది. హెచ్ఎండీఏ భూములపై అనేకమార్లు కన్నేసి తప్పుడు డాక్యుమెంట్లతో వాటిని స్వాధీనం చేసుకునేందుకు విశ్వప్రయత్నం చేశారు. పలుచోట్ల అసైన్డ్ రైతులను బెదిరించి అడ్డికి పావుసేరులా కొనుగోలు చేసి ప్రభుత్వ రికార్డుల్లో పట్టా మార్చేందుకు రెవెన్యూ అధికారులపై తీవ్రస్థాయిలో ఒత్తిడి తెచ్చిన సందర్భాలున్నాయి. కేసీఆర్ ప్రభుత్వ అండతో అధికారులు న్యాయస్థానాల్లో వాస్తవ డాక్యుమెంట్లతో అఫిడవిట్లు వేసి న్యాయ పోరాటం చేశారు. సుప్రీంకోర్టు వరకు వెళ్లారు. పలు కేసుల్లో ప్రభుత్వం విజయం సాధించి రూ.వేల కోట్ల భూముల్ని తిరిగి స్వాధీనం చేసుకున్న దాఖలాలు ఉన్నాయి. సదరు ప్రజాప్రతినిధి అప్పట్లో ప్రభుత్వ పెద్దలను కలిసినా ఆయన కన్నేసిన వందలాది ఎకరాల భూములకు సంబంధించి రికార్డుల్లో మార్పు జరగలేదు.

విద్యార్థినులను కొరికిన ఎలుకలు

మొదటిపేజీ తరువాయి...

బెడదతో ఇబ్బందులు పడుతున్నారు. ఈ క్రమంలో బుధవారం రాత్రి 12 మంది విద్యార్థినులను ఎలుకలు కరిచాయి. విషయం తెలిసి విద్యార్థినుల తల్లిదండ్రులు గురువారం హాస్టల్‌కు చేరుకుని సిబ్బందిని నిలదీశారు. ప్రిన్సిపాల్ కలుగజేసుకుని విద్యార్థినులకు ఇబ్బంది కలుగకుండా చర్యలు తీసుకుంటామని తల్లిదండ్రులకు నచ్చజెప్పి పంపించారు. విద్యార్థినులు మీడియాకు ఎలుకలు కరిచిన గాయాలను చూపించారు. రాత్రి పూట ఎలుకలు నిద్రపోనివ్వడం లేదని, హాస్టల్ ఆవరణలో కుక్కలతోనూ భయంగా ఉన్నదని పేర్కొన్నారు. హాస్టల్‌లో విద్యార్థినులకు ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు చేపడతామని ప్రిన్సిపాల్ సరళాదేవి తెలిపారు.

పన్నులు పిండండి.. ఆదాయం పెంచండి

- నెలవారీ టార్గెట్లు నిర్దేశించుకోండి
- ప్రతి నెలా మొదటివారంలో సమీక్షిస్తా
- పన్నుల ఎగవేతపై కఠినంగా ఉండండి
- జీఎస్టీ రాబడిని పెంచే మార్గాలు వెతకండి
- మద్యం అక్రమ సరఫరాకు అడ్డుకట్టపడాలి
- ఆదాయం తెచ్చే వనరులు, పన్నుల వసూళ్లపై నజర్
- ఏవియేషన్ ఇంధనంపై ఉన్న పన్ను సవరణపై పరిశీలన
- ఆదాయ మార్గాల పెంపుపై మంత్రులు, అధికారులతో సీఎం రేవంత్‌రెడ్డి సమీక్ష

గురువారం సచివాలయంలో పలు శాఖలపై నిర్వహించిన సమీక్షలో మాట్లాడుతున్న సీఎం రేవంత్. చిత్రంలో డిప్యూటీ సీఎం భట్టి, మంత్రులు పొంగులేటి, జూపల్లి, సీఎస్ శాంతికుమారి

హైదరాబాద్, జూలై 11 (నమస్తే తెలంగాణ): పన్నుల వసూళ్లలో కఠినంగా వ్యవహరిస్తూ, రాష్ట్ర ఆదాయం పెంచాలని అధికారులకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దిశానిర్దేశం చేశారు. రాష్ట్రంలో నిర్దేశించిన వార్షిక లక్ష్యంతో పోలిస్తే ఈ ఆర్థిక సంవత్సరం జూన్ వరకు వచ్చిన ఆదాయం అంత ఆశాజనకంగా లేదని అసంతృప్తి వ్యక్తంచేశారు. ఓటాన్ అకౌంట్ బడ్జెట్‌లో పొందుపరిచిన వార్షిక లక్ష్యాన్ని చేరుకోవాలంటే, నెలవారీ లక్ష్యాలు నిర్దేశించుకోవాలని సూచించారు. నిర్ణీత ఆదాయ లక్ష్యాలపై ఇకనుంచి ప్రతి నెలా మొదటివారంలో తానే సమీక్ష నిర్వహిస్తానని తెలిపారు. ప్రతి శుక్రవారం ఆర్థిక శాఖ మంత్రి భట్టి విక్రమార్క సంబంధిత శాఖల లక్ష్య సాధన పురోగతిపై సమావేశమవుతారని చెప్పారు. రాష్ట్రానికి ఆదాయం తెచ్చిపెట్టే ఎక్సైజ్, వాణిజ్య పన్నులు, మైనింగ్, స్టాంపులు, రిజిస్ట్రేషన్లు, రవాణా విభాగాల అధికారులతో సీఎం ఏ రేవంత్‌రెడ్డి.. డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి, జూపల్లి కృష్ణారావుతో కలిసి గురువారం సచివాలయంలో సమీక్ష నిర్వహించారు. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి, ఆర్థిక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ.. రాష్ట్రానికి ఆదాయం తెచ్చిపెట్టే విభాగాలన్నీ నిర్ణీత వార్షిక లక్ష్యాన్ని సాధించేందుకు ప్రయత్నించాలని అధికారులను ఆదేశించారు. ఇసుక, ఖనిజ వనరుల ద్వారా వచ్చే ఆదాయం పెరగాలంటే అక్రమ రవాణా, లీకేజీలను అరికట్టాలని సూచించారు. గత ఆర్థిక సంవత్సరం కంటే ఈ ఏడాది మరింత ఆదాయం వచ్చేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలని సూచించారు. పన్నుల ఎగవేత లేకుండా అన్ని విభాగాలు కఠినంగా వ్యవహరించాలని ఆదేశించారు. ఆదాయ వనరులు, పన్నుల వసూళ్ల విషయంలో అధికారులు నిక్కచ్చిగా వ్యవహరించాలని ఆదేశించారు. ప్రధాన ఆదాయ మార్గమైన జీఎస్టీ ఆదాయం పెంచుకోవడానికి కావల్సిన అన్ని చర్యలను వెంటనే చేపట్టాలని సూచించారు. జీఎస్టీ రాబడి పెంపునకు వాణిజ్య పన్నుల శాఖల అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించాలని, పకడ్బందీగా ఆడిటింగ్ నిర్వహించాలని ఆదేశించారు. పెట్రోలు, డీజిల్‌పై వ్యాట్ ద్వారా వచ్చే ఆదాయం తగ్గిందని, దానికి ప్రత్యామ్నాయంగా ఏవియేషన్ ఇంధనంపై ఉన్న పన్నును సవరించే అవకాశాలను పరిశీలించాలని సూచించారు.

మద్యం అక్రమ రవాణకు అడ్డుకట్ట వేయాలి

రాష్ట్రంలో ఎన్నికల సమయంలో మద్యం విక్రయాలు ఎక్కువగా జరిగినప్పటికీ ఆదాయం పెరగక పోవడానికి కారణాలను సీఎం రేవంత్‌రెడ్డి ఆరా తీశారు. మద్యం అక్రమ రవాణాకు అడ్డుకట్ట వేయాలని, నాన్ డ్యూటీ పెయిడ్ లిక్కర్‌ను అరికడితే ఆదాయం పెరిగే అవకాశం ఉన్నదని ఈ సందర్భంగా చర్చించారు. డిస్టిలరీల నుంచి మద్యం అడ్డదారి పట్టకుండా నిఘా పెట్టాలని, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకోవాలని సూచించారు. ఇప్పటికే రాష్ట్రంలో భూములు, స్థిరాస్తుల రేట్లు భారీగా పెరిగాయని, రిజిస్ట్రేషన్లు, స్టాంపుల ద్వారా వచ్చే ఆదాయం పెరిగేందుకు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. రాష్ట్రంలో ఎలక్ట్రిక్ వాహనాలను ప్రోత్సహించేందుకు పరిమిత కాలం పన్ను సబ్సిడీ అమల్లోకి వచ్చిందని, తిరిగి పన్ను వసూలు చేయడం ద్వారా వాహనాల అమ్మకాలపై ఏమైనా ప్రభావం పడిందా? అన్న అంశంపై అధ్యయనం చేయాలని ముఖ్యమంత్రి అధికారులకు సూచించారు.

కాంగ్రెస్ నేత భూదాహం.. రైతు ఆత్మహత్యాయత్నం

20 లక్షలు ఇస్తేనే భూమి వదిలేస్తానని బెదిరింపు

రైతు పరిస్థితి విషమం.. గాంధీ దవాఖానకు తరలింపు

సిద్దిపేట ప్రతినిధి/కొండపాక, జూలై 11 (నమస్తే తెలంగాణ): భూమి తగాదా విషయమై కాంగ్రెస్ నాయకుడి వేధింపులు తాళలేక ఓ పేద రైతు పురుగుల మందు తాగి ఆత్మహత్యకు యత్నించాడు. కుటుంబ సభ్యులు వెంటనే ఆయనను హైదరాబాద్‌లోని గాంధీ దవాఖానకు తరలించారు. ఈ ఘటన గురువారం సిద్దిపేట జిల్లా గజ్వేల్ నియోజకవర్గం కొండపాక మండలం దమ్మక్కపల్లిలో జరిగింది. గ్రామానికి చెందిన బండి పెద్దోళ్ల కిష్టయ్య సర్వేనంబర్ 1039లో ఉన్న 2.13 ఎకరాల భూమిని సాగు చేసుకుంటూ జీవిస్తున్నాడు. అందులో కొంత భూమిని మరొకరికి అమ్ముకున్నాడు. భూమిని కొనుగోలు చేసిన వారికి, తనకు ఉపయోగపడేలా కొంత భూమిని దారి కోసం వదిలి వాడుకుంటున్నాడు. అదే గ్రామానికి చెందిన ఆగంరెడ్డి చాలా కాలం క్రితం సర్వేనంబర్ 1038లో తన పేరుతో ఉన్న భూమిని మరొకరికి అమ్ముకున్నాడు. అందులో తనకు మరింత భూమి రావాలని బండి పెద్దోళ్ల కిష్టయ్య, అతని కుటుంబ సభ్యులను వేధిస్తున్నాడు. మొదటి నుంచి కాంగ్రెస్ పార్టీ వ్యక్తిగా, గజ్వేల్ మాజీ ఎమ్మెల్యే, సిద్దిపేట జిల్లా డీసీసీ అధ్యక్షుడు తూంకుంట నర్సారెడ్డికి దగ్గర వ్యక్తిగా పేరు పొందాడు. ఇప్పుడు తమ ప్రభుత్వం వచ్చిందని, తనను ఏమీ చేయలేరంటూ నర్సారెడ్డి ద్వారా బెదిరించాడని కిష్టయ్య భార్య కనకవ్వ ఆరోపించింది. 20 రోజులుగా ఈ వేధింపులను భరించలేక తన భూమిని కొలిచి చూపించాలని ప్రభుత్వ సర్వేయర్‌కు దరఖాస్తు చేసుకున్నాడు. మొదటి రోజు ఎవరికీ లొంగకుండా కిష్టయ్య భూమిని కొలిచిన ప్రభుత్వ సర్వేయర్.. రెండోరోజు భయానికి గురై కిష్టయ్యకు సంబంధించిన భూమి ఆగంరెడ్డికి చెందుతుందని రిపోర్టును తయారుచేశాడు. పంచనామా కాపీని దరఖాస్తుదారుడు కిష్టయ్యకు కాకుండా ఆగంరెడ్డికి అందజేసి వెళ్లాడు. ఈ తప్పుడు రిపోర్టు వల్ల తమ భూమిలోకి వెళ్లేందుకు కిష్టయ్య తీసిన దారి మొత్తం ఆగంరెడ్డికే చెందుతుందని, తమకు తీవ్ర అన్యాయం చేశారని బాధిత రైతు వాపోతున్నాడు. ఇది అన్యాయమని రైతు కిష్టయ్య ఎంత వేడుకున్నా కనికరించని ఆగంరెడ్డి.. రూ.20 లక్షలు ఇస్తేనే దారి వదులుతానని, కిష్టయ్య కుటుంబాన్ని గ్రామంలో ఉండనివ్వనని బెదిరించాడు. మనస్తాపం చెందిన కిష్టయ్య గురువారం సాయంత్రం తన పొలం వద్ద పురుగుల మందు తాగాడు. గమనించిన స్థానికులు, కుటుంబసభ్యులు వెంటనే సిద్దిపేట ప్రభుత్వ దవాఖానకు తరలించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌లోని గాంధీకి తరలించారు.

అదానీకి అప్పగిస్తే ఒప్పుకోం

మొదటిపేజీ తరువాయి...

యాజమాన్యం రాజకీయ ఒత్తిళ్లకు లొంగకుండా చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని కోరారు. సంస్థ డీపీఈ, విజిలెన్స్‌ను పూర్తిస్థాయిలో వినియోగించుకోవాలని సూచించారు.

దావోస్‌లోనే ఆదానీతో చీకటి ఒప్పందం

అదానీతో దావోస్‌లోనే చీకటి ఒప్పందం జరిగిందని, వరల్డ్ ఎకనామిక్ ఫోరం సదస్సు వేదికగా తెలంగాణ కరెంట్‌పై గుత్తాధిపత్యాన్ని అదానీ చేతుల్లో పెట్టడానికి సీఎం రేవంత్‌రెడ్డి అంగీకరించారని యూనియన్ నేతలు ఆరోపించారు. అదానీతో సీఎం రేవంత్‌రెడ్డి చేసుకున్న ఒప్పందాలను బయటపెట్టాలని డిమాండ్ చేశారు. ఎస్పీడీసీఎల్, ఎన్‌పీడీసీఎల్, జెన్‌కో, ట్రాన్స్‌కో వంటి సంస్థలన్నీ ప్రజలు చెల్లించిన కరెంట్ బిల్లులతో సంపాదించిన ఆస్తులని తెలిపారు. ఇదేమీ ప్రైవేటు ప్రాపర్టీ కాదనీ, దీనిపై చేసుకునే ఒప్పందం కూడా పబ్లిక్ డాక్యుమెంటేనని గుర్తుచేశారు. నాలుగు కోట్ల మంది ప్రజలకు చెందిన ఈ ఆస్తులను అదానీకో, అంబానీకో ఇస్తామని అంటే 55 వేల మంది విద్యుత్తు ఉద్యోగులు చూస్తూ ఊరుకోరని హెచ్చరించారు. అదానీకి కరెంట్ పంపిణీ వ్యవస్థను, బిల్లుల వసూలును అప్పగించి ఉద్యోగులను ఏం చేస్తారని ప్రశ్నించారు. ఉద్యోగులకు రక్షణ కల్పిస్తే ఎంత పెద్దవాళ్లకైనా, ఎంతటి పహిల్వాన్‌లకైనా నోటీసులు ఇచ్చి కరెంట్ సప్లయ్ ఆపేసే సత్తా తమకు ఉందని స్పష్టం చేశారు. సంస్థ ప్రయోజనాల కోసం, సంస్థను సంరక్షించుకునేందుకు తాము ఎల్లప్పుడూ సిద్ధంగా ఉంటామని పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన విద్యుత్తు సవరణ బిల్లు-2022ను రద్దుచేయాలని డిమాండ్ చేశారు. అనంతరం తమ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని సంస్థ సీఎండీకి అందజేశారు. కార్యక్రమంలో సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కే ఈశ్వర్‌రావు, ప్రధాన కార్యదర్శి వీ గోవర్ధన్, ప్రెసిడెంట్ కుమారచారి, వర్కింగ్ ప్రెసిడెంట్ ఎన్ స్వామి, ఉపాధ్యక్షులు వెంకట్‌నారాయణ, మధు, నాగేశ్వర్‌రావు, వెంటేశ్వర్‌రావు, కార్యదర్శులు సుధాకర్, రవీంద్రప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

అదానీపై వైఖరి స్పష్టం చేయండి: కేటీఆర్

అదానీ విషయంలో లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్‌గాంధీ తన వైఖరిని ప్రకటించాలని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కే తారక రామారావు డిమాండ్ చేశారు. అదానీ విద్యుత్తు సంస్థల వ్యవహారంలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అనుసరిస్తున్న అవకాశవాద, ద్వంద్వ వైఖరిపై రాహుల్‌గాంధీకి గురువారం ఎక్స్ వేదికగా కేటీఆర్ మరోసారి చురకలు అంటించారు. అదానీ విద్యుత్తుపై కాంగ్రెస్ పార్టీ వైఖరి అర్థం చేసుకోవడం కష్టమంటూ కేటీఆర్ ఎద్దేవా చేశారు. అదానీ విద్యుత్తు సంస్థకు వ్యతిరేకంగా మహారాష్ట్రలో నిరసన కార్యక్రమాలు చేపట్టిన కాంగ్రెస్ శ్రేణులు, మరో వైపు అదే అదానీ సంస్థకు స్వాగతం చెప్పడంపై అభ్యంతరం వ్యక్తం చేశారు.



నూతన డీజీపీ జితేందర్‌కు శుభాకాంక్షలు తెలుపుతున్న తెలంగాణ పోలీసు అధికారుల సంఘం నేతలు

డీజీపీని కలిసిన పోలీసు అధికారుల సంఘం

హైదరాబాద్, జూలై 11 (నమస్తే తెలంగాణ) : నూతన డీజీపీ జితేందర్‌ను తెలంగాణ పోలీసు అధికారుల సంఘం గురువారం కలిసి శుభాకాంక్షలు తెలిపింది. కార్యక్రమంలో రాష్ట్ర అధ్యక్షుడు గోపిరెడ్డి, హైదరాబాద్ సిటీ అధ్యక్షుడు నల్ల శంకర్‌రెడ్డి, రాచకొండ అధ్యక్షుడు భద్రారెడ్డి, నాగర్‌కర్నూల్ అధ్యక్షుడు గుణవర్ధన్, మహబూబ్‌నగర్ అధ్యక్షుడు వెంకటయ్య, వరంగల్ అధ్యక్షుడు శోభన్, నల్లగొండ అధ్యక్షుడు జయరాజు, సీఐడీ అధ్యక్షుడు మల్లికార్జున్, పీటీవో అధ్యక్షుడు వెంకటరెడ్డి, నిజామాబాద్ అధ్యక్షుడు మహమ్మద్ షకీల్ పాల్గొన్నారు. అలాగే తెలంగాణ గెజిటెడ్ అధికారుల కేంద్ర సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఏలూరి శ్రీనివాసరావు కలిసి ప్రత్యేక అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో సంఘం ప్రధాన కార్యదర్శి సత్యనారాయణ, అసోసియేట్ ప్రెసిడెంట్ శ్యామ్ పాల్గొన్నారు.

కొత్త డీజీపీకి టీజీఏవో అభినందనలు

రాష్ట్ర నూతన డీజీపీగా బాధ్యతలు చేపట్టిన డాక్టర్ జితేందర్‌ను తెలంగాణ గెజిటెడ్ అధికారుల కేంద్ర సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఏలూరి శ్రీనివాసరావు గురువారం కలిసి ప్రత్యేక అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో సంఘం ప్రధాన కార్యదర్శి ఏ సత్యనారాయణ, అసోసియేట్ ప్రెసిడెంట్ బీ శ్యామ్, నాయకులు నరహరిరావు, కృష్ణయాదవ్, పరమేశ్వర్‌రెడ్డి, కిషన్ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

లోకం పోకడ

ఇంట్లో ఎవరూ లేరు అంకుల్.. అమ్మ చీరెల షాపింగ్‌కు, డాడీ ఎమ్మెల్యేల షాపింగ్‌కు వెళ్లారు!

వానకాలం

	గరిష్ఠం	కనిష్ఠం
రంగారెడ్డి	36.1°c	23.8°c
ఆదిలాబాద్	35.1°c	25.1°c
మెదక్	34.8°c	25.1°c
హైదరాబాద్	34.5°c	24.5°c
మహబూబ్‌నగర్	34.2°c	24.5°c
నిజామాబాద్	33.4°c	25.6°c
కరీంనగర్	33.0°c	26.0°c
వరంగల్	33.0°c	24.0°c
నల్లగొండ	33.0°c	23.2°c
ఖమ్మం	31.0°c	25.0°c

రెండు రోజులు భారీ వర్షాలు

హైదరాబాద్ వాతావరణ కేంద్రం

హైదరాబాద్, జూలై 11 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలోని పలు జిల్లాలో రాబోయే రెండు రోజులు భారీ వర్షాలు కురుస్తాయని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది. నైరుతి రుతుపవనాలు బలపడటం, బంగాళాఖాతంలో ద్రోణి ప్రభావంతో వర్షాలు పడే అవకాశం ఉందని చెప్పారు. ప్రస్తుతం పశ్చిమ మధ్య బంగాళాఖాతంలో దక్షిణ ఏపీ తీరం వెంబడి సముద్రమట్టానికి 3.1కి.మీ. నుంచి 7.6 కి.మీ. ఎత్తులో ఉపరితల ఆవర్తనం ఏర్పడిందని తెలిపారు. నిర్మల్, నిజామాబాద్, జగిత్యాల, ఆదిలాబాద్, కుమ్రంభీం-ఆసిఫాబాద్, మంచిర్యాల, జయశంకర్ భూపాలపల్లి, వికారాబాద్, సంగారెడ్డి, మెదక్, కామారెడ్డి, ములుగు, భద్రాద్రి-కొత్తగూడెం జిల్లాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని చెప్పారు. హైదరాబాద్‌లో పొడి వాతావరణం ఉంటుందని, మధ్యాహ్నం ఉష్ణోగ్రతలు 30-32 డిగ్రీ సెల్సియస్ మధ్యలో ఉంటాయని చెప్పారు. సాయంత్రం లేదా రాత్రి సమయాల్లో నగరంలోని పలు ప్రాంతాల్లో వర్షం కురిసే అవకాశం ఉందని తెలిపారు. గురువారం నారాయణపేట జిల్లా మరికల్‌లో 2.66 సెం.మీ., మహబూబ్‌నగర్ జిల్లా దేవరకద్రలో 2.44 సెం.మీ., సూర్యాపేట జిల్లా మేళ్లచెర్వులో 1 సెం.మీ చొప్పున వర్షపాతం నమోదైనట్టు వాతావరణ శాఖ తెలిపింది.

ఫేక్ ఫోన్‌పేతో మోసాలు

వ్యాపారులే లక్ష్యంగా చీటింగ్

నిర్మల్‌లో నలుగురు యువకుల అరెస్ట్

నిర్మల్ అర్బన్, జూలై 11: డబ్బులు అత్యవసరం ఉందంటూ వ్యాపారులను మోసగిస్తున్న ఫేక్ ఫోన్‌పే యాప్ ముఠా సభ్యులను గురువారం నిర్మల్ పోలీసులు అరెస్టు చేశారు. నిర్మల్ డీఎస్పీ గంగారెడ్డి వెల్లడించిన వివరాల ప్రకారం.. నిజామాబాద్ జిల్లా రెంజర్ల మండలంలోని పలు గ్రామాలకు చెందిన జమెల్ల భరత్ (కొరియర్ బాయ్), ధరంసోత్ సాయికిరణ్ (కూలీ), రాథోడ్ అరుణ్ (కూలీ), రాథోడ్ జీవన్ (హార్వెస్టర్ ఆపరేటర్) స్నేహితులు. టెన్త్, ఇంటర్ వరకు చదువుకున్న వీరు సులువుగా డబ్బులు సంపాదించాలని ఫేక్ ఫోన్‌పే యాప్‌ను ఉపయోగించి మోసాలకు పాల్పడే వృత్తిని ఎంచుకున్నారు. ఫేక్ యాప్ ద్వారా డబ్బులు పంపకపోయినా పంపినట్టు (అమౌంట్ సెండ్ సక్సెస్‌ఫుల్) రావడంతో నిజామాబాద్, రామాయంపేట, కామారెడ్డి, నిర్మల్ జిల్లాల్లో మోసాలకు పాల్పడ్డారు. జమెల్ల భరత్ స్నేహితులతో కలిసి గత నెల 2న నిర్మల్‌లోని పోలీస్ పెట్రోల్ బంక్‌కు వచ్చాడు. పెట్రోల్ పోసే వ్యక్తితో అత్యవసరం ఉన్నదని మాయమాటలు చెప్పి రూ.8 వేల నగదు ఫేక్ ఫోన్ పే యాప్ ద్వారా పే చేసినట్టు నమ్మించి నగదు తీసుకున్నాడు. వచ్చిన నగదును నలుగురు సమానంగా పంచుకున్నారు. గత నెల 28న నిర్మల్‌లోని కావేరి పెట్రోల్ బంక్‌కు వెళ్లి బంధువులు దవాఖానలో ఉన్నారని నమ్మబలికి వారికి ఫేక్ యాప్ ద్వారా రూ.8 వేలు పంపినట్టు చేసి నగదు తీసుకుని ఉడాయించారు. వ్యాపారి తమ ఖాతాను పరిశీలించే సరికి నగదు రాకపోవడంతో పోలీస్‌లకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసిన పోలీసులు నిందితుల కోసం గాలింపు చర్యలు చేపట్టారు. గురువారం వాహనాలు తనిఖీ చేస్తుండగా అనుమానాస్పదంగా కనిపించడంతో విచారించగా నేరం ఒప్పుకున్నారు. నలుగురిని అరెస్టు చేసి వీరి నుంచి నాలుగు మొబైల్‌ఫోన్లు, ద్విచక్ర వాహనాన్ని సీజ్ చేసి వారిని రిమాండ్‌కు తరలించినట్టు పోలీసులు తెలిపారు.